నల్ల పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, ఏప్రిల్ 13: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జగుతున్నాయి. శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అందోల్, ఏప్రిల్ 13: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకులు కొసిగే శంకర్, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన నాయకులు శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు. లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించినట్లు శంకర్ తెలిపారు. తమ వంతుగా శక్తివంచనలేకుండా ఎంపీ బీబీ పాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. జరిగిందన్నారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌ను కూడా కలిసి సన్మానించారు.

జోగినాథ ఆలయ ఉత్సవాలు ప్రారంభం

జోగినాథ ఆలయంలో హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

అందోల్, ఏప్రిల్ 13: పట్టణంలోని ప్రసిద్ధ జోగినాథ స్వామి ఆలయ ఉత్సవాలను శనివారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి రోజు గణపతి పూజ, హోమం, గరుడ గంగ స్నానం పల్లకీ సేవతో జోగినాథ స్వామి జాతర ప్రారంభమవుతుందని తెలిపారు. జోగినాథ ఆలయ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చింతల సురేశ్, రంగ సురేశ్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బ్రహ్మయ్య, ప్రభాకర్, అలే యాదగిరి, గోపాల్ పాల్గొన్నారు.

వేలెత్తి చూపే పరిస్థితి తెచ్చుకోలేదు

- విలువలు, కట్టుబాట్లతో బతుకుతున్నా..
- మంత్రి కొండాసురేఖ వ్యాఖ్యలు గర్హనీయం
- పూటకో పార్టీ మార్చే ఆమె తనపై విమర్శలు చేయడం తగదు
- కుమ్మకైన కాంగ్రెస్, బీజేపీ
- ఈనెల 16న కేసీఆర్ సభను విజయవంతం చేయాలి
- నర్సాపూర్‌లో విలేకరులతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,ఏప్రిల్ 13: తాను విలువలు, కట్టుబాట్లతో బతుకుతున్నానని, చిల్లర రాజకీయాలు చేయడం తనకు తెలియదని, ఇప్పటి వరకు తనపై వేలెత్తి చూపే పరిస్థితి తెచ్చుకోలేదని, ఇక మీదట తెచ్చుకోనని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శనివారం విలేకరులతో ఆమె మాట్లాడారు. తనపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.పూటకో పార్టీ మారే మంత్రి కొండా సురేఖ తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను పార్టీని వీడలేదని, పదేండ్లు కాంగ్రెస్ జెండాను భుజస్కంధాలపై మోశానని గుర్తుచేశారు. మంత్రిగా, డీసీసీ అధ్యక్షురాలిగా పనిచేశానని, ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేసినట్లు గుర్తుచేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, తన వివరణ అడగకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి 2గంటల్లోపే తనను సస్పెండ్ చేశారన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీని వీడినట్లు సునీతా లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. ఎలాంటి పదవులు లేకున్నా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై బీఆర్ఎస్‌పై బురద జల్లడం తగదని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు నిర్వహిస్తానని ఆయన ప్రకటించడం మంచి నిర్ణయం అన్నారు. వెంకట్రామిరెడ్డిపై అవినీతి ఆరోపణలు మోపడం మంత్రి కొండా సురేఖకు తగదన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఓడిపోయిన అభ్యర్థిని ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నారని, ఇంత కంటే దరిద్రం ఏముంటుందని ఆమె ప్రశ్నించారు.

కేసీఆర్ సభను విజవంతం చేయండి...

ఈనెల 16న సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొనే సభను విజయవంతం చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాలకు చెందిన సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చలేదని, వాటిని ప్రజల దృష్టికి ఈ సభ ద్వారా ముందుకు తీసుకెళ్తామని అన్నారు. రైతుల సమస్యలను, వారికిచ్చిన హామీలను సభ ద్వారా ఎండగడతామని వెల్లడించారు సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు సూరారం నర్సింహులు, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రింగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పులిమామిడి రాజుకు కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

బీజేపీకి ఎదురుదెబ్బ

- పార్టీని వీడిన సంగారెడ్డి నేత పులిమామిడి రాజు
- రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

సంగారెడ్డి ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల వేళ సంగారెడ్డి నియోజకవర్గంలో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. సంగారెడ్డి నియోజకవర్గ కీలకనేత, ఎమ్మెల్యేగా పోటీచేసిన పులిమామిడి రాజు ముదిరాజ్ బీజేపీకి రాజీనామా చేశారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాజు వెంట మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ఉన్నారు. పులిమామిడి రాజు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి సంగారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 20వేల పైచిలుకు ఓట్లు సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ రాజు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇటీవల బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సంగారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ సమావేశాల్లో రాజు పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో సైతం ఆయన వెన్నంటే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం కృషి చేస్తానంటూ చెప్పిన ఆయనే అకస్మాత్తుగా పార్టీ వీడటం సంగారెడ్డి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బీజేపీ శ్రేణులు సైతం పులిమామిడి రాజు తీసుకున్న నిర్ణయంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ తనకు సరైన ప్రాధాన్యం ఇవ్వడంలేదని రాజు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు బీజేపీ నేత పులిమామిడి రాజును కలిసి కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా కోరినట్లు సమాచారం. బీజేపీ నేతగా ఉన్న పులిమామిడి రాజు సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నీలం మధు సైతం ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వాడు కావటం, కాంగ్రెస్ పదవి ఇస్తామని హామీ ఇవ్వటంతో పులిమామిడి రాజు బీజేపీ వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం కార్పొరేషన్ పదవి ఇస్తామని రాజుకు కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చినట్లు సమాచారం. పులి మామిడి రాజుతోపాటు ఆయన అనుచరులు, మద్దతుదారులు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్నతరుణంలో పులిమామిడి రాజు బీజేపీకి రాజీనామా చేయటం ఆ పార్టీకి నష్టమేనని చెప్పవచ్చు. రాజు బాటలోనే మరికొంత మంది నాయకులు బీజేపీని వీడేందుకు సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తున్నది.

చేవెళ్ల సభకు గులాబీ దండు



ఓల్డ్ ఎంఐజీ నుంచి చేవెళ్ల బహిరంగ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 13: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ తలపెట్టిన చలో చేవెళ్ల భారీ బహిరంగ సభకు భారతీనగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్ రెడ్డి నేతృత్వంలో ఓల్డ్ ఎంఐజీ నుంచి సుమారు 500మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని ఆదర్శ్‌రెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌గౌడ్, రవీందర్‌రావు, నాగమణి, భాస్కర్, తిలావత్, సంపత్‌గౌడ్, చిన్న, రాకేశ్, వెంకట్‌రెడ్డి, బేబీ, స్వర్ణలత, సంధ్య, జయమ్మ, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్‌కు ఎదురులేదు

రామచంద్రాపురం, ఏప్రిల్ 13: పటాన్‌చెరులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి శనివారం ఆర్సీపురం డివిజన్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ పుష్పానగేశ్ నేతృత్వంలో శ్రేణులు సండేమార్కెట్ నుంచి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ బలంగా ఉన్నదని, మెదక్ గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, ఐలేశ్, పరమేశ్, రాజు, కృష్ణకాంత్, ముత్యం, సోహైల్, శ్రీరాములు, నర్సింగ్‌రావు, రవితేజ, రవి, ప్రీతిగౌడ్, రాణి పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

విజయ్‌పాటిల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కోహీర్, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొంటింటి మాణిక్‌రావు కోరారు. శుక్రవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంబాలపల్లి బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌పాటిల్‌ను నియమించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడాలన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి

జిన్నారం, ఏప్రిల్ 13: మండల కేంద్రం జిన్నారం గ్రామానికి చెందిన వంగేటి రాజిరెడ్డి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి చేతులమీదుగా శనివారం నియామక పత్రాన్ని రాజిరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.నర్సింగ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఉన్నారు.

గుమ్మడిదల: టోల్ ప్లాజా నుంచి సమావేశానికి తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిస్తాయి

గుమ్మడిదల, ఏప్రిల్ 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయాన్ని అందిస్తాయని ఎంపీపీ, జడ్పీటీసీలు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు గుమ్మడిదల మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలనుంచి ముఖ్యనాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివెళ్లారు. గుమ్మడిదల టోల్ ప్లాజా నుంచి మండల స్థాయి నాయకులతో ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ స్థాయి సమావేశానికి తరలివెళ్లారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

నారాయణఖేడ్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ, తదితరులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్ ప్రభుత్వ దవాఖానలో సామాజిక ఉద్యమ, సేవా, బ్లడ్ డోనర్స్ కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఉద్యమకారులు మహనీయుల జయంతుల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్త దానంతో మరో ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు కోటారి నర్సింహులు, బ్లడ్ డోనర్స్ వ్యవస్థాపకులు ముజాహిద్, ఓంప్రకాశ్, బి.కాన్షీరాం, వీణాకుమారి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవయ్య(ఫైల్)

సురేశ్(ఫైల్)

కోహీర్, ఏప్రిల్ 13: మండలంలోని దిగ్వాల్ గ్రామం 65వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఎస్సై కృష్ణయ్య కథనం ప్రకారం.. దిగ్వాల్ గ్రామానికి చెందిన దేవయ్య(35) కింగ్స్ దాబాలో భోజనం చేశాడు. జాతీయ రహదారి గుండా ఇంటికి తిరుగు పయనమయ్యాడు. రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ వైపు నుంచి అతివేగంగా వచ్చి వాహనం అతడిని ఢీకొట్టింది. అతడికి తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. అతడి భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దేవయ్య గతంలో దిగ్వాల్ గ్రామ ఆదర్శ రైతుగా ఉన్నారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..

సిర్గాపూర్, ఏప్రిల్ 13: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సిర్గాపూర్ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గైరాన్‌తండాకు చెందిన విస్లావత్ సురేశ్(28) సొంత పనులపై శుక్రవారం సాయంత్రం సిర్గాపూర్‌కు వెళ్లి తిరిగి రాత్రి బైక్‌పై తన గ్రామానికి బయలుదేరాడు. స్థానిక చెరువు సమీపంలో రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మొరం కుప్పకు తగిలి కింద పడిపోయాడు. తలకు బలంగా గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖేడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

- హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.50 లక్షలు పట్టివేత
- జహీరాబాద్‌లో 130 వాహనాలు సీజ్

న్యాల్‌కల్: హుస్సేల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు నగదును పట్టుకున్న పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 13: మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శనివారం రూ.1.50లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. బీదర్-జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత పత్రాలు లేకపోవడంతో చెక్‌పోస్టు పోలీసులు నగదును సీజ్ చేసినటట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు పేర్కొన్నారు. వాహనాల తనిఖీల్లో ఎస్ఐ అభిమాన్యుసింగ్, కేంద్ర పోలీసు బలగాలు, ఎక్సైజ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు

వాహనాలు సీజ్

కోహీర్, ఏప్రిల్ 13: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు, నియమ నిబంధనలు పాటించాలని జహీరాబాద్ పట్టణ సీఐ రవి కోరారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో పోలీసులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించి ఒరిజినల్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 130 వాహనాలను సీజ్ చేశారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు

రాయికోడ్, ఏప్రిల్ 13: మద్యం తాగి వాహనం నడపొద్దని ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం రాయికోడ్, చిమ్లాపూర్ గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ ఎక్బాల్, సిబ్బంది రాజేందర్, సునీల్, తుకారం, వాస్‌నాయక్ ఉన్నారు.

కోహీర్: జహీరాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాయికోడ్‌లో వాహనలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

మార్షల్ ఆర్ట్స్‌లో బాలికలు రాణించాలి

పోతులబోగుడలో మార్షల్ ఆర్ట్స్‌లో బెల్టులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులు

వట్‌పల్లి, ఏప్రిల్ 13: నేటి సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు బాలికలు ఆత్మరక్షణ విద్య మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని ప్రిన్సిపాల్ మల్లిక అన్నారు. మండల పరిధిలోని పోతులబోగుడ మోడల్ స్కూల్‌లో పీఎంశ్రీ పథకం కింద మూడు నెలలుగా విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్‌లో ఇస్తున్న శిక్షణ శనివారంతో ఈ సందర్భంగా విద్యార్థినులకు వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అందులో 75 మంది విద్యార్థినులకు బెల్టు లు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి

మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి, ఎంపీ బీబీ పాటిల్

న్యాల్‌కల్, ఏప్రిల్ 13: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ జహీరాబాద్ అభ్యర్థి, ఎంపీ బీబీపాటిల్ ఆన్నారు. శనివారం న్యాల్‌కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మండలానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్, నాయకులు పాండురంగారెడ్డి, బస్వరాజ్‌పాటిల్, ఈరన్న, విద్యాసాగర్‌పాటిల్, శివాజీపాటిల్, దేశెట్టిపాటిల్, ఏక్‌నాథ్ రావు, శరణయ్యస్వామి, మల్లేశం, మల్లప్ప, సతీష్‌గుప్తా, రాహుల్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తీర్చండి

చిలేమామిడిలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

చిలేమామిడిలో మహిళల నిరసన

ఝరాసంగం, ఏప్రిల్ 13: తమ గ్రామంలో తాగునీటి ఇబ్బందులను తీర్చాలని చిలేమామిడి గ్రామ మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. బోరు బావిలో కూడా భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సరఫరా చేసే ట్యాంకులు కూడా నిండడం లేదన్నారు. గ్రామంలో రెండు ఓఆర్‌హెచ్ఎస్ ట్యాంకులు ఉన్నాయని, కానీ, మిషన్ భగీరథ, బోరు బావి నీటితో వాటిని సరిగా నింపడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడప్పుడూ వచ్చే నీళ్ల కోసం బిందెలతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిష్కరించడంలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు. తాగునీటి ఇబ్బందుల గురించి ఎంపీవోను వివరణ కోరగా సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకుంటామన్నారు.